ప్రశాంతంగా పది పరీక్షలు

బుట్టాయగూడెం: పదో తరగతి పరీక్షలు సోమవారం ఏజెన్సీ ప్రాంతంలో ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 9 గంటలకే విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. 9:30 నుంచి 12:45 నిమిషాల వరకూ పరీక్షలు జరిగాయి. బుట్టాయగూడెం జెడ్పీ హైస్కూల్‌లో 230 మంది పరీక్షలకు హాజరు కాగా ఇద్దరు గైర్హాజరైనట్లు ఎంఈఓ టి. బాబూరావు తెలిపారు. గురుకుల పాఠశాల బూసరాజుపల్లిలో ఏర్పాటు చేసిన కేంద్రంలో 272 మంది హాజరుకాగా 10 మంది గైర్హాజరయ్యారని, గురుకుల పాఠశాల కేఆర్‌పురంలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రంలో 149 మంది పరీక్షలు రాయగా, 42 మంది విద్యార్థులు హాజరుకాలేదని ఎంఈఓ చెప్పారు. తొలిరోజు తెలుగు పరీక్షను విద్యార్థులు రాసి ఎంతో ఆనందంగా బయటకు వచ్చారు. గిరిజన సంక్షేమ శాఖ బుట్టాయగూడెం, ఏటీడబ్ల్యూఓ, ఇన్‌చార్జి డిప్యూటీ డైరెక్టర్ శ్రీవిద్య విద్యార్థులను పరీక్ష వివరాలపై అడిగి తెలుసుకున్నారు. అలాగే ఎస్సై డి. దుర్గా మహేశ్వరరావు ఆధ్వర్యంలో పరీక్షాకేంద్రం వద్ద పోలీసు బందోబస్తు నిర్వహించారు.


బుట్టాయగూడెంలో పరీక్ష వివరాలు తెలుసుకుంటున్న ఏటీడబ్ల్యూఓ ఇన్‌చార్జి డీడీ శ్రీవిద్య


జంగారెడ్డిగూడెంలో పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులు

చింతలపూడిలో 65 మంది గైర్హాజరు

చింతలపూడి: మండలంలో పదో తరగతి పరీక్షలకు 8 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. రెగ్యులర్, ప్రైవేటు విద్యార్థులు కలిపి మొత్తం 1,356 మందికి గాను 65 మంది విద్యార్థులు తెలుగు పరీక్షకు గైర్హాజరయ్యారని ఎంఈవో జి రామారావు వెల్లడించారు. విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు గంట ముందుగానే చేరుకోవాలని విద్యాశాఖ ఆదేశాలు ఇవ్వడంతో రూరల్ గ్రామాల నుంచి వచ్చే విద్యార్థులు ఇబ్బంది పడ్డారు. ఆ సమయంలో ఆర్టీసీ బస్సులు ఉండకపోవడంతో విద్యార్థులు ఆటోలు, ఇతర వాహనాలను ఆశ్రయించాల్సి వచ్చింది. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద పోలీసు బందోబస్తుతో పాటు, వైద్య సదుపాయం కల్పించారు.

509 మంది హాజరు

ద్వారకాతిరుమల: మండలంలో పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి.ఎం.నాగులపల్లి పంచాయితీ పరిధి ద్వారకానగర్‌లోని డీపాల్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో 212 మంది విద్యార్థులకు గాను 208 మంది, ద్వారకాతిరుమలలోని శ్రీశ్రీనివాసా జూనియర్ కళాశాలలో 200 మందికి గాను 198 మంది, శ్రీ వేంకటేశ్వర స్వామివారి దేవస్థానం ఓరియంటల్ ఉన్నత పాఠశాలలో 104 మందికి గాను 103 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. తొలిరోజు మొత్తం 509 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా 7 గురు గైర్హాజరయ్యారని విద్యాశాఖ అధికారులు తెలిపారు.

463 మంది హాజరు

టి.నరసాపురం: మండలంలో పదో తరగతి పరీక్షలకు 480 మంది పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా, 463 మంది పరీక్షలు రాశారని, ఇది 96.45శాతంగా ఉందని ఎంఈవో టి.రామ్మూర్తి తెలిపారు. స్థానిక జెడ్పీహైస్కూల్‌లో మొత్తం 175 మంది పరీక్షకు హాజరుకాగా నలుగురు గైర్హాజరయ్యారన్నారు. బొర్రంపాలెం జెడ్పీహైస్కూల్‌లో 213 మంది హాజరు కాగా, 13 మంది గైర్హాజరయ్యారు. అప్పలరాజుగుడెం గురుకుల పాఠశాలలో 75మందికి పరక్షలకు హాజరయ్యారు.

623 మంది గైర్హాజరు

కామవరపుకోట: మండలంలో సోమవారం పదో తరగతి పరీక్షకు 637 మందికిగాను 14 మంది గైర్హాజరుకాగా 623 మంది పరీక్ష రాశారని ఎంఈఓ డి.సుబ్బారావు తెలిపారు. మండలంలో తడికలపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, కామవరపుకోట సెయింట్ మేరీ హైస్కూల్లో, స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు.

294 మంది హాజరు

కుక్కునూరు: పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పరీక్షలు నేపథ్యంలో అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. మండల వ్యాప్తంగా మొత్తం 308 విద్యార్థులకుగాను సోమవారం 294 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా 14 మంది విద్యార్థులు గైర్హాజరైనట్టు అధికారులు తెలిపారు.

పోలవరం రూరల్: మండలంలోని పోలవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 252 మంది విద్యార్థులకు గాను 8మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని, అలాగే గూటాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 106మందికి గాను ముగ్గురు విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈవో కె.సురేష్‌బాబు

విద్యార్థికి సపర్యలు

జంగారెడ్డిగూడెం: రోడ్డు ప్రమాదంలో గాయపడిన విద్యార్థికి కానిస్టేబుల్, నర్సు సపర్యలు చేశారు. సోమవారం పదో తరగతి పరీక్ష రాసేందుకు వెళుతున్న జంగారెడ్డిగూడెం బాలుర హైస్కూల్‌కు చెందిన విద్యార్థి డి.లక్ష్మీసాయి అరవింద్ స్థానిక సాయిదుర్గా మల్టీ హాస్పటల్ రోడ్డులో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో గాయపడ్డాడు. స్థానికులు నాగసూరి బాలసుబ్రహ్మణ్యం చొరవతో విద్యార్థి స్థానిక చైతన్య స్కూల్‌లో పరీక్ష కేంద్రానికి చేరుకున్నాడు. విద్యార్థిని గమనించిన కానిస్టేబుల్, నర్సు అతనికి సపర్యలు చేసి పరీక్ష రాసేందుకు ధైర్యాన్ని ఇచ్చారు.


ద్వారకాతిరుమలలో దేవస్థానం పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థుల సందడి


జంగారెడ్డిగూడెంలో విద్యార్థికి సపర్యలు చేస్తున్న కానిస్టేబుల్, నర్సు


కుక్కునూరు జెడ్పీ హైస్కూల్లో పరీక్ష రాసిన విద్యార్థులు

వైభవంగా కోదండరాముని విగ్రహ ప్రతిష్ఠ


సీతా లక్ష్మణ ఆంజనేయ సమేత కోదండరామునికి పూజలు నిర్వహించిన అర్చకులు

జంగారెడ్డిగూడెం: రామచంద్రపురం శ్రీకోదండ రామాలయంలో సోమవారం కోదండ రామాలయ విగ్రహ, యంత్ర, శిఖర, ధ్వజ, పరివార దేవతాపునర్నూతన ప్రతిష్ఠ శాస్త్రోక్తంగా నిర్వహించారు. వాస్తు విద్వాన్ పండిట్ చావా రమేష్‌బాబు, బ్రహ్మశ్రీ గరిమెళ్ల ప్రభాకరశాస్త్రి, బ్రహ్మశ్రీ తంగిరాల సూర్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం శాంతి కళ్యాణం జరిపారు. అన్నసమారాధనలో 6వేల మంది భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించినట్లు ఆలయ కమిటీ తెలిపింది.

హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలం

బుట్టాయగూడెం: కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన సూపర్‌సిక్స్ పథకాల హామీల అమలులో పూర్తిగా విఫలమైందని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు మొడియం నాగమణి విమర్శించారు. ఆ పార్టీ ఆధ్వర్యంలో బుట్టాయగూడెం, పోలవరం మండల కమిటీల ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజా చైతన్యయాత్రను సోమవారం స్థానిక బస్టాండ్ వద్ద జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిగా ఏర్పడి అమలుకు సాధ్యంకాని హామీలను ఇచ్చి ప్రజలను ఘోరంగా మోసం చేశాయని ఆరోపించారు. ప్రభుత్వం ఏర్పడి పది నెలలు గడుస్తున్నా ఇచ్చిన హామీలను గాలికి వదిలేశారని ఎద్దేవా చేశారు. విద్యుత్ చార్జీలను భారీగా పెంచుతూ సామాన్యులపై ఆ భారాన్ని మోపడం అన్యాయమని అన్నారు. కార్యక్రమంలో బుట్టాయగూడెం, పోలవరం మండల కార్యదర్శులు తెల్లం రామకృష్ణ, కారం భాస్కర్, పోలోజు నాగేశ్వరరావు, చుంద్రు బుల్లెమ్మ, కె. భీమరాజు, తదితరులు పాల్గొన్నారు.


బుట్టాయగూడెంలో ప్రజా చైతన్య యాత్రను ప్రారంభిస్తున్న దృశ్యం

ఉపాధి కూలీలకు సొమ్ములు చెల్లించాలి

టి.నరసాపురం: సీపీఎం చైతన్య యాత్ర మండలంలో రెండోరోజు కొనసాగింది. మల్లప్పగూడెంలో ప్రారంభమై, అబ్దుల్లాపురం, సాలిగూడెం, మధ్యాహ్నపువారిగూడెం, వెంకటాపురం మీదుగా బొర్రంపాలెం వరకు కొనసాగింది. టి.నరసాపురం మండల కార్యదర్శి మడకం సుధారాణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ మల్లప్పగూడెంలో మూడు వారాల పాటు ఉపాధి హామీ పనులు చేసిన వారికి, పేర్లు జాబితాలో లేవని సొమ్ములు ఇవ్వలేదన్నారు. అబ్దుల్లాపురం, సాలిగూడెం గ్రామాల్లో శ్మశానవాటిక సమస్య ఏళ్ల తరబడి అలానే ఉందన్నారు. మధ్యాహ్నపువారిగూడెంలో దళితుల శ్మశానవాటిక ఏడు ఎకరాలు ఆక్రమణ గురైందన్నారు. అధికారులు సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు.

పట్టిన్నపాలెం వంతెన నిర్మాణం చేపట్టాలి

జంగారెడ్డిగూడెం: సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రజా చైతన్య యాత్ర రెండవ రోజు మైసన్నగూడెం, శ్రీనివాసపురం, అక్కంపేట, పట్టిన్నపాలెం గ్రామాల్లో జరిగింది. జోడే సూర్యచంద్రం అధ్యక్షతన జరిగిన ఈ యాత్రలో సీపీఎం మండల కార్యదర్శి ఎం.జీవరత్నం మాట్లాడుతూ పట్టిన్నపాలెం వంతెన నిర్మాణ శంకుస్థాపన చేసి సుమారు 20 ఏళ్లు కావస్తున్నా ఇప్పటివరకు వంతెన నిర్మాణం పూర్తికాలేదని, వెంటనే పూర్తి చేయాలన్నారు. మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు

జంగారెడ్డిగూడెంలో అభివృద్ధికి పెద్దపీట

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీలో అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామని, అందుకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి తెలిపారు. జంగారెడ్డిగూడెం మున్సిపల్ కార్యాలయంలో నిర్మిస్తున్న సీసీ రోడ్డును సోమవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ పట్టణంలో ప్రజలకు అవసరమైన అన్ని రకాల మౌలిక వసతుల కల్పనకు కౌన్సిల్ కట్టుబడి ఉందన్నారు. ప్రతి నెలా నిర్వహించే సమావేశంలో ప్రజల అవసరాలను చర్చించి, అందుకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణాధ్యక్షుడు చిటికెల అచ్యుతరామయ్య, కౌన్సిలర్ ఎల్‌వీఆర్, వైఎస్సార్ సీపీ నాయకులు బత్తిన చిన్న, పెసరగంటి త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.


మున్సిపల్ కార్యాలయ ఆవరణలో సీసీ రోడ్డు నిర్మాణాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

నాటు సారా విక్రయిస్తే కఠిన చర్యలు

చింతలపూడి: సారా తయారు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ పి అశోక్ హెచ్చరించారు. నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా చింతలపూడి ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని రేచర్ల, రాఘవాపురం గ్రామాల్లో నాటు సారా వల్ల జరిగే అనర్థాలపై సోమవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. సారా తయారీ, విక్రయం, రవాణా, డ్రగ్స్, గంజాయి రవాణా నేరమన్నారు. ఇటువంటి నేరాలకు పాల్పడే వారి వివరాలు టోల్ ఫ్రీ నెంబర్ 14405 కు గాని, ఎక్సైజ్ స్టేషన్ చింతలపూడి సెల్ నెంబర్ 94409 02428 గాని సమాచారం అందిస్తే దాడులు చేసి కేసులు నమోదు చేస్తామని తెలిపారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని చెప్పారు. అనంతరం గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. సారా కేసులో పట్టుబడిన రాఘవాపురం గ్రామానికి చెందిన ఇంజుమూడి రాంబాబును తహసీల్దార్ ముందు బైండోవర్ చేయగా రూ.1,75,000 జరిమాన విధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో చింతలపూడి ఎక్సైజ్ ఎస్సైలు ఆర్‌వీఎల్ నరసింహారావు, అబ్దుల్ ఖలీల్, సిబ్బంది పాల్గొన్నారు.


రేచర్లలో నాటుసారా నిరోధించాలని కోరుతూ పోస్టర్‌ను ప్రదర్శిస్తున్న దృశ్యం

అటవీ అధికారులపై చర్యలు తీసుకోవాలి

బుట్టాయగూడెం: గిరిజనుడిని అన్యాయంగా కొట్టిన అటవీ అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం సాయంత్రం బుట్టాయగూడెం పోలీస్ స్టేషన్ ఎదుట వివిధ సంఘాల నాయకులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆదివాసీ ఐక్య కార్యాచరణ కమిటీ చైర్మన్ మొడియం శ్రీనివాసరావు, న్యూడెమోక్రసీ నాయకులు కారం రాఘవ, ఆదివాసీ నాయకుడు కారం వాసు మాట్లాడుతూ బుట్టాయగూడెం మండలం గుళ్లపూడికి చెందిన మడకం యాకోబుపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. అన్యాయంగా దాడి చేసిన సబ్ డీఎఫ్ఓతోపాటు సిబ్బందిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని కోరుతూ కానిస్టేబుల్ ప్రసాద్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు బన్నే వినోద్, తదితరులు పాల్గొన్నారు.


పోలీసులకు వినతిపత్రం అందజేస్తున్న వివిధ సంఘాల నాయకులు

రామాలయ అభివృద్ధికి విరాళం

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని రామచంద్రాపురంలో కోదండ రామాలయ అభివృద్ధికి పరిమి వెంకటరత్నం, ఝాన్సీ రాణి, కుటుంబసభ్యులు పవన్, స్రవంతి, ఎన్ఆర్ఐ రామ్‌ప్రసాద్ రూ. 5లక్షల విరాళం అందజేశారు. అలాగే మోతుకూరి అమ్మిశెట్టి కుటుంబసభ్యులు రంజిత్ మురళి రూ.లక్ష విరాళాన్ని అందించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యాసంస్థలు జీవో నంబర్ 35 పాటించాలి

జంగారెడ్డిగూడెం: విద్యాసంస్థలు తప్పనిసరిగా జీవో నంబర్ 35ని పాటించాలని జంగారెడ్డిగూడెం ఆర్టీవో ఎండీ మదని అన్నారు. స్థానిక కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణంలోని విద్యాసంస్థల యాజమాన్యాలు నడుపుతున్న బస్‌లకు ఖచ్చితంగా ఫిట్‌నెస్, ఇన్సూరెన్స్, ఎమర్జెన్సీ కిట్, పొల్యూషన్ సర్టిఫికెట్ తప్పనిసరిగా ఉండాలన్నారు. అలాగే డ్రైవర్ తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. సోమవారం నుంచి స్పెషల్‌డ్రైవ్‌లు నిర్వహిస్తామని, విద్యాసంస్థలకు చెందిన ప్రతి బస్సును తనిఖీ చేస్తామన్నారు. జీవో నెంబర్ 35కు అనుగుణంగా ప్రతి విద్యాసంస్థ వారి బస్సులను నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో విద్యాసంస్థల యాజమాన్యాలు, డ్రైవర్లు, రవాణా శాఖాధికారులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

కుక్కునూరు: కుక్కునూరు నుంచి బూర్గంపాడు వరకు నిలిచిన రోడ్డు నిర్మాణ పనులు సోమవారం తిరిగి ప్రారంభమయ్యాయి. బిల్లులు చెల్లించలేదన్న కారణంగా కాంట్రాక్టర్ రోడ్డు నిర్మాణ పనులను మధ్యలోనే ఆపివేశారు. గతంలో రోడ్డు నిర్మాణ పనులు చేపట్టిన కాంట్రాక్టర్ రోడ్డును తవ్వి వెట్ మిక్స్ పోసి కాంట్రాక్టర్ అలానే వదిలేయడంతో ఇన్ని రోజులు వాహనదారులు రోడ్డుపై లేచిన దుమ్ముతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. తెలంగాణలో చేసిన రోడ్డు పనులకు సంబంధించి బిల్లు రావడంతోనే రోడ్డు పనులు ప్రారంభించినట్లు తెలుస్తుంది. కాగా ఆ రోడ్డు పనులు కొంతమేరకే చేసి ఆపివేస్తారన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.


కొనసాగుతున్న ఆర్‌అండ్‌బీ రహదారి పనులు

వ్యక్తి మృతిపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: ఆటోలో నుంచి జారిపడి ఒక వ్యక్తి మృతి చెందిన ఘటన పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. వివరాలు ఇలా ఉన్నాయి. పల్నాడు జిల్లా మాచవరం మండలం కొత్తపాలానికి చెందిన మర్రి సీతయ్య(49), అతని భార్య మరియమ్మ నెల రోజుల క్రితం మండలంలోని చల్లవారిగూడానికి పొగాకు పని నిమిత్తం వచ్చారు. ఈ నెల 15న సీతయ్య తన స్వగ్రామం వెళ్లి తిరిగి సోమవారం జంగారెడ్డిగూడెం నుంచి చల్లవారిగూడెం ఆటోలో బయలుదేరాడు. జల్లేరు సమీపానికి వెళ్లే సరికి ఆటో వేగానికి, కుదుపులకు ఆటో నుంచి సీతయ్య జారి పడిపోయాడు. దీంతో అతను అక్కడికక్కడే మృతిచెందాడు. దీనిపై భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ ఎన్.ఉమామహేశ్వరరావు తెలిపారు.

క్లుప్తంగా

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి


ఆర్డీవో కార్యాలయ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏపీ స్టేట్ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులు సోమవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. వెంటనే 12 పీఆర్‌సీ కమిషన్ ఏర్పాటు చేసి ఐఆర్ ప్రకటించాలని, పీఆర్‌సీ బకాయిలు ఇప్పించాలని, ఈహెచ్ఎస్‌పై క్యాష్‌లెస్ వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జంగారెడ్డిగూడెం అధ్యక్షుడు ఎస్.రాధాకృష్ణ, కార్యదర్శి కె.నాగేశ్వరరావు, కోశాధికారి కె.త్రినాధరావు తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ


మెడల్స్ సాధించిన విద్యార్థులు

చింతలపూడి: మచిలీపట్నంలో సోమవారం జరిగిన ఆల్ ఇండియా కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో చింతలపూడి స్పోర్ట్స్ కరాటే అకాడమీ కి చెందిన విద్యార్థులు 5 గోల్డ్ మెడల్స్, 2 సిల్వర్ మెడల్స్, 4 బ్రాంజ్ మెడల్స్ సాధించడంతో పాటు బెస్ట్ విన్నర్స్ ట్రోఫీ గెలిచినట్లు కోచ్ పి. సుమన్ రాజు తెలిపారు. తమ అకాడమీకి చెందిన జమాల్, జై సూర్య, సంహిత, కంసీనాబ్ గోల్డ్ మెడల్స్ సాధించగా, మోహిత్, ధీరజ్ సిల్వర్ మెడల్స్, శ్రీవల్లి, శ్రీరామ్, లలిత్, రేవన్ బ్రాంజ్ మెడల్స్ సాధించినవారిలో ఉన్నట్లు తెలిపారు. మెడల్స్ సాధించిన విద్యార్థులను గ్రామస్తులు, తల్లిదండ్రులు అభినందించారు.

వాకర్స్ క్లబ్ నూతన కార్యవర్గం

కొయ్యలగూడెం: కొయ్యలగూడెం వాకర్స్ క్లబ్ నూతన కార్యవర్గం ఎంపికైనట్లు నూతన అధ్యక్షుడు ఎస్‌బీజీ శేఖర్ సోమవారం పేర్కొన్నారు. నిడదవోలులో 16వ తేదీ రాష్ట్ర ఇంటర్నేషనల్ వాకర్స్ క్యాబినెట్ మీటింగ్ నిర్వహించారన్నారు. ముఖ్యఅతిథిగా చైర్మన్ ఎం.ప్రభావతి, విశిష్ట అతిథిగా గవర్నర్ గుంటూరు రామరాజు హాజరయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో తనతో సహా కార్యదర్శిగా మాజేటి సత్యనారాయణ, కోశాధికారిగా కాకి ఆదినారాయణ, డైరెక్టర్‌గా నిడదవోలు కృష్ణలను ప్రభావతి నియమించారన్నారు.

కుర్చీల బహూకరణ

జంగారెడ్డిగూడెం: స్థానిక పర్రెడ్డిగూడెం అంగన్‌వాడీ కేంద్రానికి సోమవారం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో కుర్చీలను బహూకరించారు. అధ్యక్షుడు ఉడా రాంగోపాల్, కార్యదర్శి బవిరిశెట్టి తిలక్ మాట్లాడుతూ రోటరీ పూర్వ అధ్యక్షుడు వెలివెల పెద్దిరాజు వ్యక్తిగత వితరణతో కుర్చీలను కొనుగోలు చేసి అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో దాత వెలివెల పెద్దిరాజు, అంగన్‌వాడీ టీచర్ వరలక్ష్మి, వైద్యారోగ్య సిబ్బంది, దాత కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

లఘు చిత్ర దర్శకుడు నవీన్‌కు సత్కారం


లఘు చిత్రాల దర్శకుడు లొట్ల నవీన్‌ను సత్కరిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: హ్యూమన్‌రైట్స్ ఆఫ్ ఇండియా నిర్వహించిన లఘు చిత్రాల ప్రదర్శనలో ఉత్తమ ప్రశంసా పత్రాన్ని అందుకున్న జంగారెడ్డిగూడెంకు చెందిన లఘు చిత్ర దర్శకుడు లొట్ల నవీన్‌ను సోమవారం స్థానిక జియో హాత్‌వే సిటీకేబుల్ కార్యాలయంలో సత్కరించారు. నవీన్ మాట్లాడుతూ 300పైగా లఘుచిత్రాలు పోటీలో నిలిచాయని, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై తాను నిర్మించి దర్శకత్వం వహించిన లఘు చిత్రం ఉత్తమ ప్రశంసాపత్రాన్ని సాధించిందన్నారు. రోటరీ ఇన్నర్‌వీల్ క్లబ్ ఆఫ్ జంగారెడ్డిగూడెం అధ్యక్షురాలు నాగసూరి మాధురి, కార్యదర్శి పద్మజ్యోతి, కోశాధికారి ఆదిలక్ష్మి, చిన్ని సాయికుమార్ పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ


పీహెచ్ఎన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న పద్మజ

లింగపాలెం: లింగపాలెం పీహెచ్‌సీ నూతన పబ్లిక్ హెల్త్ నర్సింగ్ ఆఫీసర్ (పీహెచ్ఎన్. ఎస్‌టీ)గా కె.పద్మజ కుమారి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. వైద్యాధికారి డా.డి.సంధ్యారాణికి ఆమె జాయినింగ్ రిపోర్ట్ అందచేశారు. పీహెచ్ఎన్ పద్మజ మాట్లాడుతూ సిబ్బంది సహకారంతో అన్ని ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేసేందుకు కృషి చేస్తానని చెప్పారు.

దొంగనోట్ల చెలామణి?

వేలేరుపాడు: వేలేరుపాడు మండలంలో రూ.500 నకిలీ నోట్లు చెలామణీ అవుతున్నట్లు తెలిసింది. సోమవారం వేలేరుపాడు వైన్‌షాపు వద్దకు ఓ వృద్ధురాలు మద్యం కొనుగోలుకు 2,500 తీసుకెళ్లగా, వైన్‌షాపు సిబ్బంది అవి నకిలీ నోట్లుగా గుర్తించారు. తెలంగాణ రాష్ట్రంలోని భద్రాచలం, సారపాక కేంద్రాలుగా ఈ దొంగనోట్ల వ్యాపారాన్ని వేలేరుపాడు మండలంలో కొంతమంది వ్యక్తులు సాగిస్తున్నట్లు తెలుస్తోంది. శివకాశీపురానికి చెందిన ఓ వ్యక్తి బతుకుదెరువు కోసం భద్రాచలం ప్రాంతంలో ఓ పురుగుమందుల షాపులో గత కొన్నేళ్ళుగా గుమస్తాగా చేరాడు. దొంగనోట్ల ముఠాతో చేతులు కలిపిన సదరు గుమస్తా వేలేరుపాడు మండలం రేపాకగొమ్ముకు చెందిన తన బావమరిదికి దొంగనోట్లు సరఫరా చేస్తున్నట్లు తెలుస్తోంది. దీనిపై నిఘా వర్గాలు విచారణ చేపడితే వాస్తవాలు వెలుగుచూస్తాయంటున్నారు.

రాములోరి కల్యాణానికి రాట ముహూర్తం

కొయ్యలగూడెం: శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం పందిరి రాట ముహూర్త కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. శ్రీరామ్‌నగర్‌లోని రామాలయం ఎదుట బ్రహ్మశ్రీ అనిపెద్ది వెంకట నరసింహ శర్మ మూర్తి, ఆలయ కమిటీ సభ్యులు పందిరిరాట నిర్వహించారు. ఏప్రిల్ 6వ తేదీ నుంచి శ్రీరామనవమి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ


గంగానమ్మ, పోతురాజుల విగ్రహాలను ప్రతిష్ఠ చేస్తున్న దృశ్యం

పోలవరం రూరల్: బోడిగూడెం గ్రామంలో గంగానమ్మ, పోతురాజుల విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలతో పూజలు నిర్వహించి, విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి, ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాస్, ఐటీడీఏ డీవైఈవో కేలుం నీలయ్య, సర్పంచ్ కొక్కెర వెంకటలక్ష్మితో పాటు అధిక సంఖ్యలో గ్రామస్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

19న ఐటీడీఏ వద్ద ధర్నా

పోలవరం రూరల్: గత మూడు దశాబ్దాలుగా గిరిజనుల సాగులో ఉన్న భూములకు సాగు నమోదు చేసి హక్కులు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 19వ తేదీన కోటరామచంద్రాపురం ఐటీడీఏ కార్యాలయం వద్ద ఏజెన్సీ గిరిజన సంఘం, రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్నట్లు ఏజెన్సీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కుంజం రామారావు తెలిపారు. జిల్లేళ్లగూడెం, ప్రగడపల్లి, వింజరం పంచాయతీ పరిధిలో సాగులో ఉన్న భూములను నమోదు చేయాలన్నారు. ఆదివాసీ సంక్షేమ చట్టాలన్నింటిని పటిష్ఠంగా అమలు చేయాలని, అలాగే 1/70, పీసా 2005 అటవీ హక్కు చట్టాలను అమలు చేయాలని తదితర డిమాండ్‌లతో ధర్నా చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

ఆక్రమణ తొలగించాలి

జంగారెడ్డిగూడెం: వేగవరం గ్రామంలో డ్రెయినేజీ ఆక్రమణలను తొలగించాలని సీపీఐఎంఎల్ ప్రజా పోరాట సమితి కోరింది. ఈమేరకు సోమవారం స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి వినతిపత్రం అందజేశారు. సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కలింపూడి సుందర్రావు మాట్లాడుతూ జాతీయ రహదారిని ఆక్రమించుకోవడం వల్ల వర్షాకాలంలో నీరు గ్రామంలోకి చేరుతోందని, వెంటనే ఆక్రమణలు తొలగించాలని కోరారు. కార్యక్రమంలో కామన సత్యనారాయణ, షేక్ షఫీక, ఎం.మరియమ్మ, సీహెచ్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు రక్షిత తాగునీరు

కొయ్యలగూడెం: పదో తరగతి పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు మానవత శాఖ రక్షిత తాగునీటి సరఫరా కల్పించింది. సోమవారం కొయ్యలగూడెం, పరింపూడి పరీక్షా కేంద్రాల వద్ద కూలింగ్ వాటర్‌ను విద్యార్థులకు సభ్యులు అందజేశారు. అధ్యక్షుడు మాటూరి సుధీర్, కంభంపాటి సాయి, ముప్పనపల్లి వెంకటేశ్వరరావు, వీఎస్ఎన్ స్వామి, బొమ్మ మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

మానవత సహాయం

జంగారెడ్డిగూడెం: కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న కూరెళ్ల నాగరత్నం అనే మహిళకు సోమవారం మానవత ఆధ్వర్యంలో రూ.7 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. మానవత మండల అధ్యక్షుడు ఏవీ రమణమూర్తి, సభ్యులు పాల్గొన్నారు.